తరుణి స్వావలంబన పునరావాస కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణ

చైతన్యపురి: లైంగిక వేధింపులకు గురైన బాలికల కోసం తరుణి సంస్థ ఆధ్వర్యంలో చైతన్యపురిలో ఏర్పాటు చేసిన తరుణి స్వావలంబన పునరావాస, నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపుల బాధితులకు పునరావాసంతో పాటు వారి నైపుణ్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఫెర్నాండేజ్ ఆసుపత్రి వైద్యురాలు ఎవికా ఫెర్నాండేజ్ మాట్లాడుతూ వేధింపులకు గురైన గర్భిణులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా డెలివరీ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. తరుణి సంస్థ డైరెక్టర్ డాక్టర్ మమతా రఘువీర్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల బాధితుల కోసం తెలంగాణలోనే మొట్టమొదటి కేంద్రాన్ని తామే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తరుణి నేషనల్ డైరెక్టర్, రిటైర్డ్ ఫారెస్ట్ అధికారి రఘువీర్, ఎగ్సాగాన్ కంపెనీ ప్రతినిధులు శ్రీలేఖ, బల్లవ్ ముద్ర, తరుణి సంస్థ ప్రతినిధులు మంజుల, జీవిత, రణధీర్, సంతోష్, భార్గవి, జ్యోతి, భవానీ, చైత్రిని, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, కార్పొరేటర్లు

ఎల్‌బీనగర్: గణేశ్ నవరాత్రులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య అన్నారు. సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జన సమయంలో చెట్లకొమ్మలను తొలిగించాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. చెరువులు, బేబీ పాండ్ల వద్ద ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, రాంకీ సిబ్బందికి సూచించారు. ప్రధాన చౌరస్తాలు, నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులను కోరారు. నవరాత్రుల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, అరుణ సురేందర్ యాదవ్ , ఈఈ రమేశ్‌బాబు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావనీ, అధికారులు పాల్గొన్నారు.

సైదాబాద్: గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతి లాల్ సుభాష్ సూచించారు. ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై గురువారం రాత్రి సైదాబాద్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న రజనీవితల్‌రెడ్డి

హస్తినాపురం: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్ గుమ్మకొండ రజనీవితల్‌రెడ్డి అన్నారు. సాగర్‌రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో విద్యార్థి సంఘం ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బ్యాడ్జీలు, టోపీలు అందించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ వల్ల విద్యార్థులకు ప్రజాస్వామ్యం, ఎన్నికలపై అవగాహన కలుగుతుందన్నారు. అంతకుముందు నిర్వహించిన చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, స్కూల్ ప్రిన్సిపాల్ కె.విజయకుమార్‌రావు, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం



పనులను ప్రారంభించిన కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలో రూ. 3 లక్షలతో నిర్మించనున్న పికిల్ బాల్ కోర్ట్ పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల విన్నపం మేరకు అధికారులతో చర్చించి క్రీడా మైదానాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, కాలనీ సంఘం ప్రతినిధులు శేషుబాబు, వెంకటరామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు



రాజేశ్‌కు సేవా పురస్కారం అందజేస్తున్న జనార్దన్, రవిశంకర్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ – శంకరం వేదిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మహాకవి గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను విజయవాడలోని ఠాగోర్ స్మారక గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య, సేవా రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులను అవార్డులతో సన్మానించారు. అనాథ, నిరుపేద విద్యార్థులకు భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, సినీ నిర్మాత కంఠంనేని రవిశంకర్ సేవా పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు డా.బిక్కి కృష్ణ, గిడుగు రామ్మూర్తి పంతులు మనుమరాలు – గిడుగు ఫౌండేషన్ చైర్మన్ కాంతి కృష్ణ, ఐఆర్‌ఎస్ అధికారి డా. విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన షురూ




వస్త్ర ప్రదర్శనలో చీరలు ప్రదర్శిస్తున్న దృశ్యం



వన్ గ్రామ్ బంగారు ఆభరణాలు ..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం భవన్ లో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనను కళా సిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని శారీస్, రాజస్థానీ కోటా శారీస్, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం, శారీస్ కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికెన్ వర్క్ కుర్తిస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, తిరోక్క్ వస్త్రాలు యువతకు మెచ్చేలా వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 16 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.



పనామా చౌరస్తా సమీపంలో కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు (ఫైల్)



వరదొస్తే..వణుకే..!

- జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అసంపూర్తిగా కల్వర్టుల నిర్మాణం
- ప్రమాదాల బారిన వాహనదారులు
- రెండురోజుల్లోనే రెండు ఘటనలు

వనస్థలిపురం: ఓ వైపు కొనసా..గుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు.. మరోవైపు ప్రమాదకరంగా మారిన కల్వర్టులు వాహనదారులకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. అసలే వర్షాకాలం రోడ్డుపై వరద ప్రవాహంతో గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితుల్లో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద వరద ప్రవాహంతో రోడ్డు అంచులు తెలియక రెండు కార్లు రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టుల్లోకి దూసుకెళ్లాయి.

ఏడాదిన్నరగా సా..గుతున్న రోడ్డు విస్తరణ పనులు..

ఎల్‌బీనగర్ చౌరస్తా నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు చేపట్టిన విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ఏడాదిన్నరగా సాగుతున్నాయి. కొంతమేర పనులు పూర్తయినప్పటికీ రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న కల్వర్టులు, వాటి పై కప్పు, క్యాచ్‌పిట్‌ల నిర్మాణం పూర్తికాక పోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉన్నది. ఈ నెల 15న భారీ వర్షంలో వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద ఓ కారు డ్రైవర్ రోడ్డు మార్జిన్ తెలియక పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లిపోయాడు. అలాగే 16న మరో కారు పనామా చౌరస్తా సమీపంలోని కల్వర్టులోకి దూసుకెళ్లగా అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు అందులోని వారిని ప్రాణాలతో కాపాడారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, సంబంధిత అధికారులు కల్వర్టుల నిర్మాణం, దాని పై కప్పు, జంక్షన్ల వద్ద క్యాచ్‌పిట్‌ల పనులు త్వరగా పూర్తిచేయాలని కాలనీలవాసులు, ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ఆటోనగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కల్వర్టు



అభ్యుదయనగర్ కమాన్ వద్ద ..



పనామా చౌరస్తా సమీపంలో ..

బాధ్యతల స్వీకరణ



నాగరాజుగౌడ్

హయత్‌నగర్ : హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజుగౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన రామకృష్ణ ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు. మాడ్గుల సీఐగా పని చేసిన నాగరాజ్‌గౌడ్ ట్రాన్స్‌ఫర్‌పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా..



వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ భూపతి గట్టుమల్లు

హస్తినాపురం: వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ, నాగార్జునసాగర్ రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని యూటర్న్‌ల వద్ద మాత్రమే వాహనాలను మళ్లించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించాలని ఆయన కోరారు.

రాష్ట్ర ఖ్యాతిని పెంచాలి



క్రీడాకారులతో చైర్మన్ ఎం.వీరయ్య

చాదర్‌ఘాట్: వికలాంగ క్రీడాకారులు ఆటల్లో రాణించి రాష్ట్ర ఖ్యాతిని పెంచాలని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ఎం.వీరయ్య అన్నారు. విజయ ఆనంద్ గ్రాండ్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి టాలెంట్ ఎగ్జిబిషన్ మార్చ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పారా క్రికెటర్లతో కలిసి ఆడి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం మాట్లాడుతూ.. పారా క్రీడాకారులను ఉత్తమ నైపుణ్యాలు గల ఆటగాళ్లుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటానన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు చంద్రబాన్ గిరి, పటేల్, గాడిపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

వినూత్న రీతిలో శుభాకాంక్షలు



నాగోలు: ఎల్‌బీనగర్‌కు చెందిన తెలుగు భాష–చిత్రకారుడు, కార్టూనిస్టు రాము నాగార్జున వినూత్నంగా తెలుగు భాషా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. తన కుంచెతో తల్లీబిడ్డ చిత్రాన్ని గీసి తల్లి ప్రేమలో ఎంత మాధుర్యం ఉంటుందో తెలుగు భాషలో కూడా అంతే మాధుర్యం ఉంటుందని తన చిత్రం ద్వారా తెలియజేశారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాలను విస్మరించకుండా వాటి పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు.

ప్రజల సహకారంతోనే ఆదర్శ డివిజన్



లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌లో పర్యటిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌లో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు సరూర్‌నగర్ కట్టపై చెత్త వేయవద్దని ప్లకార్డులు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మణెమ్మ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్, నరేశ్, యశ్వంత్, అశోక్, శ్రీను, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు, చెరువులను పరిరక్షించాలి



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షించాలని నియోజకవర్గ ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మొత్తం 16 చెరువుల్లో 60 శాతం మేర కబ్జాలకు గురయ్యాయని అందుకు సంబంధించి ఆధారాలను కమిషనర్‌కు అందించామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరగా, రెండు వారాల్లో సమీక్షించి చర్యలు చేపడుతామని కమిషనర్ తెలిపారని వారు పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కేవీ రంగారెడ్డి, సామాజిక కార్యకర్త పింగి వెంకన్న, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ నేత శ్యాంసుందర్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, వెంకటేశ్, పరశురాం పాల్గొన్నారు.


సొంత నిధులతో భవన నిర్మాణం అభినందనీయం



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి

మన్సూరాబాద్: సొంత నిధులతో కాలనీ సంక్షేమ భవనం నిర్మాణం చేపట్టడం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి శ్రీసాయిగణపతినగర్ కాలనీలో భవనం పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ పైపులైన్ల ఆధునీకరణకు పనులు చేపడుతానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జంగారెడ్డి, నర్సింహులు, బాలాజీ, సత్యనారాయణ, లక్ష్మణస్వామి, వెంకటేశ్, నాయకులు కడారి యాదగిరి యాదవ్, సాయిరాంగౌడ్, పారంద సాయి, ప్రవీణ్‌కుమార్, జయతేజ, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



కూలే స్థితిలో ఉన్న స్తంభం



తుప్పు పట్టిన స్తంభం కింది భాగం

మూసారంబాగ్ డివిజన్ పరిధిలో దిల్‌సుఖ్‌నగర్ నుంచి భవానీనగర్ వైపు వెళ్లే దారిలో గౌడ శ్మశానవాటిక ప్రహరీ వద్దనున్న ఇనుప కరెంట్ స్తంభం పూర్తిగా తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం అదే స్తంభం ద్వారా కరెంట్ సరఫరా అవుతోంది. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. –మలక్‌పేట

మైసమ్మ తల్లి బోనాల సందడి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణపురం డివిజన్‌లోని కొత్తపేట రైతుబజార్ బోనాల వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేశ్ నేత, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, దుబ్బాక శేఖర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలి



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నాగోలు: మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. నాగేశ్వరరావు కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ కళాజాత బృందం ద్వారా వారు ఎల్‌బీనగర్ చౌరస్తాలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకుని చెరువులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ క్రాంతి హిల్స్ కాలనీ వాసుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా వి.మనోహర్, గౌరవ అధ్యక్షుడిగా సి.యాదగిరిరెడ్డి, సలహాదారులుగా ఎస్.ఆనంద్‌రెడ్డి, బి.రవిందర్‌రెడ్డి, జి.నాగేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా హాజి ముస్తాఫ్ అలీ, బి.గాలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కే.రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, న్యాయ సలహాదారుడిగా సీహెచ్.ధనుంజయ, సభ్యులుగా లచ్చిరెడ్డి, శశివర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని బృందావన్‌కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నూతన రోడ్లు వేయాలని, తాగునీటి కనెక్షన్ డ్రైనేజ్ లైన్ కనెక్షన్లు కూడా ఇచ్చేలా చూడాలని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కొరివి శ్రీనివాస్ యాదవ్, రాకేశ్, సతీశ్, నాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



అధికారులతో కలిసి హయత్‌నగర్ సర్కిల్‌లో పర్యటిస్తున్న రఘుప్రసాద్

ఎల్‌బీనగర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సీఎస్ రఘు ప్రసాద్ సూచించారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త పాయింట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చెత్త సేకరణను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, అధికారులు మహమూద్ షేక్, నీలిమా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGAREDDY DISTRICT AT SHADNAGAR

O.S.No. 198 of 2003

Between : Kuntla Kumar, S/o. Late K. Narsaiah, Aged about 44 Years, Occ : Labour, R/o. H.No. 2-24/3, Satamrai Village, Gaganpahad, Shamshabad Mandal, R.R. District. ...Plaintiff

AND

1. Kuntla Krishna, S/o. Late Kuntla Narsaiah, Aged about 45 Years, Occ : Service, R/o. H.No.2-24/3, Satamrai Village, Gaganpahad, Shamshabad Mandal, R.R. District.

3. B. Muralikrishna Reddy, S/o. Madhava Reddy, Aged about 56 Years, Occ : Business, R/o. 8-4-17/188, Sairam Nagar Colony, Karmanghat, Ranga Reddy District. ... Respondents No 1 and 3

NOTICE

Please take notice that the Plaintiff has filed suit vide O.S.No. 198 of 2023, pending before the Junior Civil Judge, Shadnagar, seeking Partition of land admeasuring Ac. 3.38 gts., in Sy.No. 367/A, situated at Nerralla Cheruvu, Burgala Shivar, Farooq Nagar Mandal, Shadnagar, Ranga Reddy District claiming his half (1/2) share. The Hon'ble Court has adjourned this matter for hearing on 29-10-2024 at 10:30 am for your appearance. In the event of your failure to appear before the Hon'ble Court on the said date, the matter will be decided based on the material available on record in your absence. Hence the Notice.

(By Order of the Court)

Sd/- P.Ganesh, D.Srinivas, Advocates, # H.No. 3-50, Chinnagolkonda Village, Shamshabad Mandal, Rangareddy District.